

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 18 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా) 18-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	29
తెనాలి	38	29
నరసరావుపేట	38	28
బాపట్ల	37	29
రెంటచింతల	37	27
చీరాల	37	29





జిల్లా పరిషత్
విభజనకు అడుగులు

- పరిపాలన పునర్వ్యవస్థీకరణకు చర్యలు
- పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ నుంచి కమిషనర్‌కు లేఖ
- మూడు జిల్లాలకు మండలాల సర్దుబాటు
- 15 నెలల్లో జడ్పీటీసీల ఎన్నికలు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌ను విభజించనున్నారు. పరిపాలన పునర్వ్యవస్థీకరణకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రతి జిల్లాకు పరిషత్ ఏర్పాటు కానుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిషత్‌లకు మండలాలను సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభంకానుంది. పంచాయతీరాజ్ డైరెక్టర్ విభజన ప్రక్రియకు సంబంధించి ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో 57 మండలాలు ఉన్నాయి. కొత్త జిల్లాల్లో ఉన్న మండలాల ఆధారంగా జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నారు. 2026 సెప్టెంబరులో జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలి. షెడ్యూల్ ప్రకారం అయితే ఎన్నికలకు 15 నెలలే గడువు ఉంది. అంతకు ముందే పునర్వ్యవస్థీకరణ పూర్తి చేయాల్సి ఉంది.

ముగియనున్న జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం

జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం 15 నెలల్లో ముగియనుంది. ఎన్నికల నాటికి విభజిత జిల్లాల వారీగా పరిషత్‌ల ఏర్పాటు ప్రక్రియను పంచాయతీరాజ్ శాఖ ప్రారంభించింది. కొత్త జెడ్పీ కార్యాలయాల ఏర్పాటుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభిస్తే ఎన్నికల నాటికి ఒక కొలిక్కి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. జెడ్పీ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది సెప్టెంబరుతో ముగియనుంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అధికారులు, ఉద్యోగుల సర్దుబాటు, కార్యాలయాల భవనాలు, సమావేశపు మందిరాలు, అధికారులకు సంబంధించిన గృహాలు, అతిథి గృహాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందు కోసం భవనాలను ఎంపిక చేయాలి. గుంటూరు జిల్లా పరిషత్‌కు అన్ని వసతులు, కార్యాలయాలు, మీటింగ్ హాల్ ఉంది. పల్నాడు, బాపట్ల జిల్లాల పరిషత్‌లకు ఆయా వసతులు కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రస్తుత జెడ్పీటీసీ సభ్యులు కోరుతున్నారు.

మండలాల విభజన ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న 57 మండలాల్లో పల్నాడు జిల్లాకు 28, బాపట్ల జిల్లాకు 12, గుంటూరు జిల్లాకు 18 మండలాలు కేటాయించారు. గుంటూరు రూరల్ మండలాన్ని గుంటూరు ఈస్ట్, వెస్ట్ రెండు మండలాలుగా విభజించారు. దీంతో గుంటూరుకు ఒక మండలం పెరిగినట్లయింది. 2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగింది. అయితే జిల్లా పరిషత్‌ను విభజించలేదు. ఉమ్మడి గుంటూరు కిందే పరిషత్ నిర్వహిస్తున్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచే పరిపాలన కొనసాగుతోంది. జిల్లా పరిషత్ పాఠశాలలు, మండల పరిషత్ కార్యాలయాల పాలన జెడ్పీ కార్యాలయం కేంద్రంగానే నిర్వహిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కే శ్రీనివాసరావు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- హెచ్చరికలు జారీ చేసిన ఎస్పీ శ్రీనివాసరావు

సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ హనుమంతరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జగన్ పర్యటనకు సంబంధించి సత్తెనపల్లి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అర్జీ అందించినా అందులో పూర్తి వివరాలు లేవన్నారు. గ్రామంలో విగ్రహావిష్కరణ జరిగే ప్రాంతం కొద్దిపాటిది కావడంతో కేవలం జగన్ సెక్యూరిటీ కాన్వాయ్, మూడు వాహనాలు, వంద మందికి మాత్రమే అనుమతి ఇచ్చామని తెలిపారు. ఇతరులకు అనుమతి లేదన్నారు. అధిక సంఖ్యలో జన సమీకరణ చేయకూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు.

నేడు ఏఎన్‌యూలో యోగాంధ్ర

10 వేల మందితో ఆసనాలకు ఏర్పాట్లు

పెదకాకాని, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025లో భాగంగా బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి జిల్లా, వర్సిటీ అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లు చేశారు. వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఉదయం 6:30 గంటల నుంచి యోగా వేడుకలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాలలతో పాటు, అనుబంధ కళాశాలలకు చెందిన సుమారు 10వేల మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొంటారన్నారు.



యోగాకు సిద్ధమైన యూనివర్సిటీ ప్రాంగణం

ఎరువుల నిల్వలు.. పుష్కలమేనా!



ముమ్మరంగా ఖరీఫ్ పనులు

- నిల్వలపై యంత్రాంగం కసరత్తు
- కొరత తలెత్తకుండా ముందస్తు సన్నద్ధతపై దృష్టి పెట్టినా!
- కృత్రిమ కొరతపై ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరికలు

వానలు ముందుగానే పలకరించాయి. ఖరీఫ్ సీజన్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అన్నదాతలు సేద్యానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టారు. సాగు పనులు ఓ వారం ముందుగానే ప్రారంభమవుతాయనే అంచనాల నేపథ్యంలో సంబంధిత వ్యవస్థలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లాల వారీగా రెండు సీజన్లకు కలిపి కావాల్సిన ఎరువుల పరిమాణం ఎంత అనే లెక్కలతో పాటు ప్రస్తుతం నిల్వ ఉన్నదెంత అనే గణాంకాలను కూడా సవివరంగా తెప్పించుకుంది. దానికి అనుగుణంగానే ప్రస్తుతం నిల్వలు సమృద్ధిగానే అందుబాటులోనే ఉన్నాయని, దశల వారీగా ఎరువుల నిల్వలు పెంచుకుంటూ పోతామని అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ పనులు మరో వారంలో పూర్తి స్థాయిలో ఊపందుకోనుండగా అన్నదాతలు ఒక్కసారిగా ఎరువుల కొనుగోలు మీద దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఎరువుల కొరత తలెత్తకుండా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళిక రూపొందించి తదనుగుణంగా అడుగులేస్తేనే మార్కెట్‌లో ఎరువుల కృత్రిమ కొరత తలెత్తకుండా ఉండే అవకాశముంది.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగు ప్రారంభం నుంచి ఎరువుల సమృద్ధిగా ఉండడం అనేది చాలా కీలకం. ఏటా సీజన్ ప్రారంభంలో పుష్కలంగా ఉన్నట్లు కనబడే ఎరువుల నిల్వలు స్వల్ప కాలంలోనే పూర్తయి అన్నదాతలకు కష్టాలు తప్పని పరిస్థితి ఎదురవుతూనే ఉంది. గత ప్రభుత్వంలో ఎరువుల నిల్వల విషయంలో ఓ ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించాల్సి ఉంది. కానీ, ఈ పద్ధతిని గత ప్రభుత్వం దాదాపుగా భ్రష్టు పట్టించింది. ఎరువుల కోసం ప్రైవేటు వ్యాపారుల దయా దాక్షిణ్యాల మీదనే ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఎరువుల నిల్వలను సమృద్ధిగా ఉంచడంపై మే నెల చివర నుంచే కసరత్తు ప్రారంభించింది.

గత ప్రభుత్వంలో దళారీలకు పండగ

సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్న దశలో కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించి (మిగతా 8వ పేజీలో)

మూడు జిల్లాల్లో నిల్వలు ఈ విధంగా..

బాపట్ల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు గాను కావాల్సిన ఎరువుల నిల్వల మొత్తం పరిమాణం 53,000 మెట్రిక్ టన్నులు కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు 28,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇందులో యూరియా 15,000 టన్నులతో అత్యధిక వాటా కాగా, 9,000 టన్నుల నిల్వలతో కాంప్లెక్స్‌ది తర్వాత స్థానంగా ఉంది. డీఏపీ, పొటాష్, ఎస్ఎస్‌పీ పొటాష్ నిల్వలు కూడా సమృద్ధిగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో సీజన్ మొత్తానికి యూరియా నిల్వలు 24,000 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా అందుబాటులో ఉన్న నిల్వలు 17,000 మెట్రిక్ టన్నులుగా ఉంది. అదే విధంగా కాంప్లెక్స్ పరిమాణం 16,000 టన్నులు అవసరం కాగా ఉన్న నిల్వ 12,000 టన్నులుగా ఉంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మొత్తం 65,000 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా ప్రస్తుతం నిల్వల రూపంలో ఉన్నది 35,000 టన్నులుగా ఉంది.

వైసీపీ జిల్లా అధ్యక్షుడి మార్పు?

- కేసుల భయంతో అజ్ఞాతంలో పీఆర్కే
- పిన్నెల్లి స్థానంలో కాసు లేదా విడదల రజిని



మాచర్ల టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కేసుల భయంతో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) గత కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయనను మార్చి వేరొకరికి పార్టీ పగ్గాలు అప్పగింతపై వైసీపీ అధిష్ఠానం దృష్టి సారించినట్లు సమాచారం. వరుసగా నాలుగుసార్లు మాచర్ల ఎమ్మెల్యేగా గెలిచిన పీఆర్కే గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డిపై ఓడిపోయారు. ఈవీఎం ధ్వంసంతో పాటు కారంపూడిలో టీడీపీ కార్యాలయం ధ్వంసం, సీఐ నారాయణస్వామిపై దాడి తదితర కేసుల్లో పీఆర్కే జైలు పాలయ్యారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంతకాలం తెలంగాణ రాష్ట్రంలో తలదాచుకున్నారు. జిల్లాలో పార్టీ వ్యవహారాలు నిర్వహించాలని అధిష్ఠానం హెచ్చరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ధర్నాలు, పార్టీ కార్యకర్తల పలకరింపులు వంటి కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. ఇటీవల వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులు హత్యకేసులో నిందితుడిగా చేర్చడంతో తిరిగి పిన్నెల్లి అజ్ఞాతంలోకి వెళ్లక తప్పలేదు. దీంతో జిల్లా పార్టీ వ్యవహారాలు కుంటుపడ్డాయి. ఇటీవల జగన్ పిలుపు మేరకు నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసనలు అన్ని దగ్గర్లా జరిగాయి. కానీ మాచర్ల నియోజకవర్గం, పల్నాడు జిల్లాలో అంతంత మాత్రంగానే జరిగాయి. ఈ పరిస్థితుల్లో పీఆర్కేను మార్చాలని అధిష్ఠానం కసరత్తు చేపట్టినట్లు సమాచారం. దీంతో రేసులో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ మంత్రి, చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే విడదల రజిని పోటీ పడుతున్నట్లు సమాచారం.

నాడు రెచ్చిపోయి.. నేడు అజ్ఞాతం

గత ప్రభుత్వ హయాంలో పిన్నెల్లి సోదరులు ఆకాశమే హద్దుగా రెచ్చిపోయి దౌర్జన్యాలు, దాడులు, ఆక్రమణలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఆయా కేసుల్లో ఇరుక్కొని బెయిల్‌పై మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బయటపడ్డారు. ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కేసుల్లో బెయిల్ పొందినా అజ్ఞాత జీవితాన్ని కొనసాగిస్తున్నారు. గుండ్లపాడు హత్య కేసులో పీఆర్కేను నిందితుడిగా చేర్చడంతో సోదరులు అజ్ఞాత జీవితం గడపక తప్పడం లేదు. బెయిల్ కోసం హైకోర్టులో ప్రయత్నించినా ముందస్తు బెయిల్ లభించలేదు. దీనికితోడు తోట చంద్రయ్య, జల్లయ్య హత్య కేసుల్లో సీబీడీ విచారణ చేపట్టి మరలా రీ ఓపెన్ చేసే అవకాశం మెండుగా ఉండడంతో పిన్నెల్లిని కష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లా అధ్యక్ష స్థానంలో ఉండి ప్రభుత్వాన్ని విమర్శిస్తే బెయిల్ రద్దయ్యే అవకాశం లేకపోలేదు. అందువల్ల జిల్లా పార్టీ బాధ్యతలను పిన్నెల్లి సవ్యంగా నడిపే అవకాశం లేకపోవచ్చని అధిష్ఠానం భావిస్తోంది. వేరొకరికి జిల్లా పగ్గాలు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

తల్లికి వందనం.. ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం

- ఎక్కువగా సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ అనర్హత అర్జీలే
- హౌస్‌హోల్డ్ నుంచి విభజించాలని విజ్ఞప్తులు

8

జగన్ తీరుపై కేడర్‌లో అసహనం

- పరామర్శల పర్యటనలపై అసంతృప్తి
- నేడు రెంటపాళ్లకు వైసీపీ అధినేత రాక.. పోలీసుల ఆంక్షలు
- నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు ప్రభుత్వానికి ఏమి సంబంధం అంటున్న ప్రజలు

8

ముగ్గురు కౌలు రైతులు ఆత్మహత్య

లోపలి పేజీలో

గుంటూరు మీదగా చర్లపల్లి, నరసాపూర్, తిరుపతి, జల్నాకు ప్రత్యేక రైళ్లు

6

ఈకేవైసీకి.. రూ. 500

- రైతు సేవా కేంద్రాల్లో అవినీతి
- వ్యవసాయాధికారులకు రైతుల ఫిర్యాదు


శావల్యాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉంటూ.. వారికి సహాయం చేసేందుకు ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలు అవినీతికి కేంద్రాలుగా మారుతున్నాయి. చాలా గ్రామాల్లో సిబ్బంది రైతుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. త్వరలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి నగదు విడుదల చేయనున్నాయి. అయితే ఈ పథకంలో అర్హత సాధించాలంటే రైతులందరికీ ఈకేవైసీ తప్పనిసరి. అన్నదాత సుఖీభవ పథకానికి ప్రభుత్వం పంపిన రైతుల జాబితాల్లో వివరాలను తమ లాగిన్‌లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది అప్‌లోడ్ చేయాలి. ఇదే అవకాశంగా రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిఈకేవైసీకి రూ.500 వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, కారుమంచి తదితర గ్రామాల్లో ఈకేవైసీ చేసేందుకు సిబ్బంది రూ.500 చొప్పున నగదు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అన్నదాత సుఖీభవ ఈకేవైసీకి ఎంపీఈవో తమ వద్ద నగదు వసూలు చేశాడని వేల్పూరుకు చెందిన రైతులు ఇన్‌చార్జి ఎంఏవో రామారావును సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. పోట్లూరు రెవెన్యూ పరిధిలోని వెలమావారి పాలెంలో 14 మంది నుంచి ఈకేవైసీ చేసినందుకు నగదు వసూలు చేసినట్లు గ్రామస్థులు ఆరోపించారు. కొత్తలూరు, కారుమంచి రైతుల నుంచి కూడా ఇలాంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి. మతుకుమల్లి, వేల్పూరు గ్రామాల్లో రైతుసేవాకేంద్రాలు మూసివేసి ఉంటున్నాయని గ్రామస్థులు తెలిపారు. వీఏఏలు సచివాలయాల్లో కూర్చొని విధులు నిర్వహిస్తుండడంతో రద్దీగా ఉండే సచివాలయాల్లో వ్యవసాయసేవలు పొందాలంటే ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రూ.25 లక్షలు ఖర్చుచేసి రైతుసేవాకేంద్రాలను నిర్మిస్తే సిబ్బంది సచివాలయాల్లో కూర్చొని కాలం గడపడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి దుస్థితి నెలకొందని విమర్శిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంఏవో రామారావును వివరణ కోరగా వేల్పూరు రైతులిచ్చిన ఫిర్యాదును ఏడీఏ, డీఏవోల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామన్నారు. మతుకుమల్లి, వేల్పూరు రైతుసేవాకేంద్రాలు తెరవడం లేదన్న విషయం తన దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.



తాళం వేసి ఉన్న మతుకుమల్లి రైతుసేవా కేంద్రం

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే వేటు

సాంకేతిక సహాయకులపై డ్వామా పీడీ ఆగ్రహం



గుండ్లపల్లిలో నీటి గుంతలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ లింగమూర్తి

నకరికల్లు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేసే ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా వేటు తప్పదని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి హెచ్చరించారు. హార్టికల్చర్ అంచనాలను సిద్ధం చేసి పరిపాలన ఆమోదం కోసం పంపకపోవటంపై సాంకేతిక సహాయకులపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మండలంలోని గుండ్లపల్లిలో నీటి గుంతల పనులను పరిశీలించారు. పనులకు హాజరైన కూలీల వివరాలను పరిశీలించారు. పనికి హాజరైన వారి సంఖ్యకు, మస్టర్‌లో ఉన్న తేడాలను గుర్తించారు. ఏ రోజు హాజరు ఆ రోజే వేయాలని ఎఫ్ఏలను ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. నీటి గుంతల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఉద్యాన సాగు రైతులను గుర్తించి వెంటనే అంచనాలను డ్వామాకు పంపాలన్నారు. ఫిర్యాదులు రాకుండా పని చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీడీవో జీ కాశయ్య, ఏపీవో జీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


బడి బ్యాగ్.. బరువు తగ్గింది

- 1, 2 తరగతులకు ఒక పాఠ్య పుస్తకం, ఒకవర్క్‌బుక్
- 3, 4, 5 క్లాసులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం

8

అసత్య ప్రచారాలు చేస్తే మహిళలే తిరగబడతారు

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అమలు చేస్తున్నా రని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద నగదు జమచేస్తుంటే.. వైసీపీ నేతల తప్పుడు, అసత్య ప్రచారాలను వి ద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మే పరిస్థితి లేదన్నారు. తల్లికి వందనంపై విషం చిమ్ముతున్నారని, రూ.2 వేలు లోకేశ్ జేబులోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగ జారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనిని నిరూపించాలని నారా లోకేశ్ సవాల్ విసిరితే వైసీపీ నేతలు తోకలు ముడిచారని ఎద్దేవా చేశారు. పసలేని ఆరోపణలు ప్రభుత్వం, లోకేశ్‌పై చేస్తే మహిళలు, విద్యార్థులే తిరగబడే రోజు వస్తుందన్నారు. తల్లికి, చెల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ నేడు తల్లికి వందనం గురించి మాట్లాడటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వైసీపీ పాలనలో రూ.13 వేలే ఇచ్చారని, మిగిలిన రూ.2వేలు జగన్ జేబులోకి పోయాయా, లేక తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అని ఎమ్మెల్యే యరపతినేని ప్రశ్నించారు. విద్యార్థులకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పులో కూడా కమిషన్ తీసుకున్న నీచ చరిత్ర వైసీపీదేనని మండిపడ్డారు.

గుంతల రోడ్ల కష్టాలకు కూటమి ప్రభుత్వం చెక్

తెనాలి-నారాకోడూరు రోడ్డును ప్రారంభించిన మంత్రి మనోహర్

తెనాలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లను గుంతలమయం చేసి, జనాన్ని గత వైసీపీ సర్కారు ముప్పుతిప్పలు పెడితే.. కూటమి ప్రభు త్వం వాటిని సరిచేసి, కొత్త రోడ్లు వేసి జనం కష్టాలను తీర్చిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి - నారాకోడూరు మధ్య రోడ్డును ఇటీవల రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ రోడ్డును మంగళవారం మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ రోడ్డు చూసినా చెరువును తలపించిందన్నారు. కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం కింద రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. తెనాలి-నారాకోడూరు తరహాలో తెనాలి - మంగళగిరి మధ్య కూడా రూ.650 కోట్లతో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం చేశామని వెల్లడించారు. తమ ప్రభుత్వం వచ్చాక ప్రధాన రహదారుల నుంచి చిన్నపాటి గ్రామీణ రోడ్లను కూడా అభివృద్ధి పరిచామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం కేవలం సంక్షేమాన్నే పరమావధిగా భావిస్తే.. కూటమి ప్రభుత్వం మాత్రం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విజన్ ఉన్న నేత ముఖ్యమంత్రి పీఠంపై ఉంటే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవనడానికి ఏడాదిలో జరిగిన అభివృద్ధే నిదర్శనమన్నారు. తెనాలి, కొల్లిపర మండలాల్లోని గ్రామీణ రోడ్ల మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు కూడా నిధులు తీసుకొస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్ మానసారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రూ. 3 కోట్లతో అభివృద్ధి పరిచిన తెనాలి-నారాకోడూరు రోడ్డుకు సంబంధించి శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

రాత్రి చంపి, పొద్దున్నే దండ వేసినట్లుంది జగన్ పర్యటన

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అరాచక శక్తులను ప్రోత్సహించడానికే వైఎస్ జగన్ పర్యట నలు చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. గుంటూరులోని తన గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళకు చెందిన ఉప సర్పంచ్ నాగమల్లేశ్వరరావు బెట్టింగ్‌లు కాసి, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ గెలుస్తుందని తప్పుడు నివేదికలు ఇవ్వడం వల్లే అతను బెట్టింగ్ కాచి.. అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడన్నారు. వైఎస్ జగన్ బుధవారం రెంటపాళ్ళల్లో నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణకు రానుండటం రాత్రి చంపి పొద్దున్నే దండ వేసినట్లుగా ఉందన్నారు. తన వల్లే నాగమల్లేశ్వరరావు చనిపోతే ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి జగనే వస్తున్నాడన్నారు. నాగమల్లేశ్వరరావు చనిపోవడం బాధాకరమన్నారు. అతనిపై రెండు కేసులు ఉన్నాయని, మనిషి చని పోయిన ఏడాది తర్వాత నానా హంగామా చేస్తూ సత్తెనపల్లికి జగన్ ఓదార్పు యాత్ర చేస్తున్నాడన్నారు. నాగమల్లేశ్వరరావు చనిపోయింది బెట్టింగ్ వల్లేనని, అప్పటికే జగన్ అధికారంలో ఉన్నాడని గుర్తుచేశారు. జగన్ రెంటపాళ్ళ పర్యటనను విరమించుకోవాలని కన్నా సలహా ఇచ్చారు. సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ నేతలు ఉన్నారు.

‘సంగం డెయిరీ’ విత్తనాల పంపిణీ

● రైతులకు మేలైన విత్తనాలు: చైర్మన్ ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూన్, 17(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంగం విత్తన పరిశోధన విభాగం కృషి చేస్తుందని సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం సంగం డెయిరీ రూపొందించిన మేలైన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డెయిరీ విత్తన పరిశోధన విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్ఆర్-2(సంగం ఆరోగ్య), ఎస్ఎస్ఆర్-4(సంగం అర్జున్) విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వరితో పాటు ఎస్ఎస్‌బీ-2(సంగం వీర), మినుము, ఎస్ఎస్‌జీ-3, సంగం భీమ్ పెసర విత్తనాలను రైతులకు పరిచయం చేశారు. వీటితో పాటు కూరగాయ పంటలైన సంగం గోదావరి, చెట్టుచిక్కుడు, సంగం రుద్ర టమాటా హైబ్రీడ్ విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన రైతులకు మరింత మేలు చేయాలనే లక్ష్యంతో డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ నేతృత్వంలో విత్తన పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతరం పరిశోధనలు చేసి, కొత్త రకం విత్తనాలను తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడులు ఇచ్చే విధంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ బీపీటీ, 5204, సర్టిఫైడ్ విత్తపాలు, ఫౌండేషన్ విత్తనాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు 93984 23590 నంబరుకు సంప్రదించాల్సిందిగా సూచించారు. ఎండీ పి.గోపాలకృష్ణన్, వివిధ విభాగాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సంగం వరి విత్తనాలు పంపిణీచేస్తున్న చైర్మన్ నరేంద్ర

పౌరుల మౌనం.. దేశానికి ప్రమాదం

● కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), జూన్ 17(ఆంధ్రజ్యోతి): బాధ్యత కలిగిన పౌరుల మౌనం.. దేశానికి ప్రమాదమని.. పెనుమాక నాగేశ్వర్ చేసిన విమర్శ సబబేనని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో పెనుమాక నాగేశ్వర్ రచించిన ‘మన మౌనమే మన శత్రువు’ కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ పాల్గొని, సంపుటిని ఆవిష్కరించారు. తొలి ప్రతిని పరుచూరి అజితకు అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెనుమాక కవిత్వంలో అసహనం కనిపిస్తుందన్నారు. సాహితీవేత్త గోటేటి లలితాశేఖర్ కవితా సంపుటిని సమీక్షిస్తూ సరళమైన భాషలో బలమైన భావాలను పెనుమాక వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రచయిత డాక్టర్ కొగంటి విజయ్‌బాబు మాట్లాడుతూ పెనుమాక శైలి సంభాషణ పద్ధతిలో కొనసాగి పాఠకులను నేరుగా పలకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాదు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



మన మౌనమే మన శత్రువు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ రమణ యశస్వీ తదితరులు

గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, తిరుపతి, జల్నాకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, నరసపూర్, తిరుపతి, జల్నాలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07233) చర్లపల్లి - నరసపూర్ ప్రత్యేక రైలు జూలై 5 నుంచి 2026 మార్చి 28 వరకు ప్రతి శనివారం రాత్రి 7.50 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు నరసపూర్ చేరుకొంటుంది. (07234) నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు జూలై 6 నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. (07609) జల్నా - తిరుపతి ప్రత్యేక రైలు జూలై 7 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 10.45కి తిరుపతి చేరుకొంటుంది. (07610) తిరుపతి - జల్నా ప్రత్యేక రైలు జూలై 8 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 3.50కి జల్నా చేరుకొంటుందన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



కిరణ్ మృతదేహం

మాచర్లటౌన్, జూన్ 17 (ఆంధ్ర జ్యోతి): ఉరి వేసుకొని యువకుడు ఆ త్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని ఐదో వార్డు సుద్ద గుంతలకు చెంది న తమ్మిశెట్టి కిరణ్ (21) ఆర్మూర్‌లో గ్రానైట్ రాయి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం పట్టణంలోని తన ఇంటికి చేరుకున్నారు. రాత్రి 8 గంటల సమయంలో తండ్రి ఏసురత్నం ఇంటికి రాగా.. తలుపులకు లోపల గడియపెట్టి ఉండడంతో పగులకొట్టి లోపలకు వెళ్లాడు. లోపల కిరణ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని నిర్జీవ స్థితిలో వేలాడుతూ కనిపించాడు. కిరణ్‌ను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బుద్ధిష్టులకు పవిత్ర ప్రదేశం అమరావతి

● నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా



జాస్తి వీరాంజనేయులును సన్మానిస్తున్న నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా

గుంటూరు సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి బుద్ధిష్టులకు పరమ పవిత్ర ప్రదేశంగా భావిస్తామని నేపాల్ బౌద్ధ సమాఖ్య అధ్యక్షుడు నూర్బు తుండుషెర్పా (తుప్టెన్ జిన్పా) పేర్కొన్నారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో నూర్బు తుండు షెర్పాతో అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూ ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మంగళవారం భేటీ అయ్యారు. అమరావతి విశిష్టతను, బౌద్ధ శిల్ప సంపదను, ధ్యాన బుద్ధ ప్రాజెక్టు విశిష్టతను వివరించారు. అమరావతి కి రావాలని నూర్బు తుండుషెర్పాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూర్బు తుండుషెర్పా స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల నుంచి అమరావతి కి బుద్ధిష్టులు వచ్చి ప్రార్థన చేసుకొని వెళ్తారని, అక్కడ సౌకర్యాలను బాగా మెరుగుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలో ఒక బృందాన్ని అమరావతికి పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాస్తి వీరాంజనేయులును నూర్బు తుండుషెర్పా సన్మానించారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

బాపట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బాపట్ల పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. రాజీవ్ గాంధీకాలనీలో నివాసం ఉంటున్న దేవరకొండ నాగరాజు (35) మద్యం సేవించి తిరుగుతుండటంతో.. భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రమ్మని కోరగా ఆమె రాకపోవడంతో నాగరాజు మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉరివేసుకుని చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుకు మహిళ మృతి



జాస్తి అరుణకుమారి

వేమూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపని గ్రామానికి చెం దిన మహిళ జాస్తి అరుణకుమారి (55) మంగళవారం పాము కాటుతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి వద్ద పాము కాటుకు గురైన అరుణకుమారిని చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సరైన వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో అరుణ కుమారి మృతి చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టుకు జంట హత్యల కేసు నిందితులు



నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

మాచర్లటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు జెవిశెట్టి సోదరుల జంట హత్యల కేసులో నిందితులను పోలీసులు విచారించి మంగళవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి ప్రశాంత్ రిమాండ్ విధించారు. గుంటూరు జిల్లా జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలను విచారించేందుకు వెల్దుర్తి పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా రెండు రోజుల అనుమతి లభించింది. దీంతో సోమ, మంగళవారాలు విచారించి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి ప్రశాంత్ రిమాండ్‌కు పంపారు. రూరల్ సీఐ నఫీజ్ బాషా ఎస్కార్ట్‌తో నిందితులు ఆరుగురిని గుంటూరు జిల్లా జైల్‌కు తరలించారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి



నాగరాజు(ఫైల్)

మేడికొండూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మేడికొండూరు మండలం పేరేచర్లలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పేరేచర్లకు చెందిన కట్టెపోగు నాగరాజు(32) సోమవారం మధ్యాహ్నం క్వారీ గుంత వైపు నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయి.. గల్లంతయ్యాడు. గమనించి స్థానికులు బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఈతగాళ్లను రప్పించి సోమవారం సాయంత్రం వరకు గాలించినా నాగరాజు ఆచూకీ లభ్యం కాకపోవడంతో చీకటి పడడడంతో గాలింపు నిలిపివేశారు. మంగళవారం రెస్క్యూ టీంతో గాలింపు చేపట్టగా నాగరాజు మృతదేహం బయటపడింది. మృతుడికి భార్య గర్భిణి, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కట్టెపోగు నాగరాజు కరడుగట్టిన టీడీపీ కార్యకర్త. గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం అహర్నిశలు పనిచేసిన నాగరాజు మరణ వార్త విని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. నాగరాజు మరణం పార్టీకి తీరని లోటు అని మాజీ వైస్ ఎంపీపీ పాములపాటి శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

తల్లుల సంతోషంతో జగన్‌కు నిద్ర కరువైంది : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుతో జగన్‌కు కంటిమీద కునుకు కరువైందని, తన ఊహకు అందని విధంగా చంద్రబాబు ప్రతి హామీని పక్కా ప్రణాళిక, నిజాయితీతో అమలుచేస్తుండటం మింగుడుపడటం లేదని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అక్కసుతోనే తన నీలి మీడియా, వైసీపీ నేతలతో కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్‌పై విషప్రచారం చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తల్లుల సంతోషాన్ని, విద్యార్థుల జీవితాలు బాగుపడటాన్ని జీర్ణించుకోలేని భిన్న మనస్తత్వం జగన్‌ది అని విమర్శించారు. తన విపరీత, వింత మనస్తత్వం తనకే ప్రమాదకరమని జగన్ గ్రహిస్తే మంచిదని ఆయన హితవు పలికారు. జగన్ హయాంలో 42 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి ఇస్తే, నేడు కూటమి ప్రభుత్వం 67.27లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో మరణించిన వైసీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావు పలు కేసుల్లో నిందితుడని తెలిపారు. అలాంటి 33 మందిని గత ఎన్నికల వేళ పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నారని, అప్పుడు అధికారంలో ఉన్న జగన్, అంబటి రాంబాబు నాగమల్లేశ్వరరావు సహా ఇతరుల్ని ఎందుకు విడిపించలేదని ప్రశ్నించారు. నాగమల్లేశ్వరావుని టీడీపీ వేధించింది అనడం జగన్, వైసీపీ బూటకపు ప్రచారం మాత్రమేనని కొట్టిపడేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతమైతే చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చి, జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠ పెరుగుతుందన్న ఈర్ష్యతోనే జగన్ సత్తెనపల్లి కేంద్రంగా శవ రాజకీయాలకు సిద్ధమయ్యాడని ప్రత్తిపాటి దుయ్యబట్టారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 513.80 అడుగులు ఉంది. ఇది 138.21 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

55,109 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 58,672 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 55,109 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11500
334	9500	13400	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13000	334	9800	13500
273	10000	12400	నెంబరు. 5	10000	13400
341	10000	13400	273	10000	13000
4884	---	---	341	10000	13800
సూపర్ 10	---	---	సూపర్ 10	10000	12800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	14400
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13500
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

కుంకలగుంట టీడీపీ అధ్యక్షుడిగా కనపర్తి

నకరికల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కుంకలగుంట టీడీపీ అధ్యక్షుడిగా కనపర్తి శ్రీనివాసరావు, త్రిపురాపురంనకు తీగ వెంకయ్య, చాగల్లుకు అలపర్తి జనార్దనరావు, నరసింగపాడుకు మేడం శివారెడ్డి, అడ్డరోడ్డుకు బత్తిన నాగేంద్రబాబు, శివాపురంనకు సబావత్ నర్మ నాయక్, బాలాజీ నగర్ తండాకు వాంకడావత్ హనుమత్యా నాయక్, చల్లగుండ్లకు మానం వెంకటేశ్వర్లును నియమించినట్టు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య తెలిపారు.

పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముప్పాళ్ళ జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కెవీ దమ్మాలపాడు ఫీడర్ లైన్ మరమ్మతు పనులు చేయుచున్న కారణంగా ఆ ఫీడర్ పరిధిలోని 5 గ్రామాల్లో విద్యుత్ సరఫరా బుధవారం నిలిపివేస్తారని విద్యుత్ ఏఈ సుచరిత మంగళవారం తెలిపారు. దమ్మాలపాడు, బొల్లవరం, రుద్రవరం, పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాలోల ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని ఆయా గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

● మాచర్ల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాచర్ల 132బై33 కేవీ సబ్‌స్టేషన్లో 33కేవీ ఓరియంటేషన్ పనులు జరుగుతున్నందున అనుపు, దుర్గి, తాళ్లపల్లి, కొప్పునూరు, ద్వారకాపురి, ఎన్ఎస్‌డ్యాం, కోలగుట్ల, ముటుకూరు సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అట్లూరి రామయ్య తెలిపారు.

అధికారిపై అవినీతి ఆరోపణలు

వీఆర్‌కు రూరల్ ఎస్ఐ నరసింహులు?


ఎస్ఐ నరసింహులు

మాచర్ల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత నెల 16వ తేదీన మాచర్ల మండలం కంభంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గురజాల మండలం పులిపాడుకు చెందిన భార్యాభర్తలు గాయపడ్డారు. వీరు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను కోసం ఎఫ్ఐఆర్ కోరగా వారిని స్టేషన్ చుట్టూ తిప్పించారు. బాధితులు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి బంధువులు కావడంతో విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే సదరు మాజీ మంత్రి ఫోన్ చేసి ఎస్ఐ నరసింహులును ఎఫ్ఐఆర్ ఇవ్వాలని కోరగా ముడుపులిస్తేనే పని చేస్తానని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై మాజీ మంత్రి.. ఎస్పీ కంచె శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ప్రైవేటు కారు డ్రైవర్ కాల్వ ప్రసాద్ తనకు రావాల్సిన జీతం డబ్బులు అడుగగా కోపోద్రిక్తుడైన ఆ ఎస్ఐ ఏందిరా నీకిచ్చేదంటూ రూరల్ సీఐ సమక్షంలోనే డ్రైవర్‌పై దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్పీ కార్యాలయానికి చేరడంతో ఎస్పీ కంచె శ్రీనివాసరావు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదుల నేపథ్యంలో రూరల్ ఎస్ఐ నరసింహులును వీఆర్‌కు పంపినట్లు విశ్వసనీయ సమాచారం.

పెదకూరపాడు పరిశీలకుడిగా అమీర్‌అలి

పిడుగురాళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకుడిగా పట్టణానికి చెందిన సయ్యద్ అమీర్‌అలి నియమితులయ్యారు. మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న అమీర్‌అలి పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ ఎన్నికలకు పరిశీలకుడిగా వెళ్లి కమిటీల నియామకాన్ని పూర్తి చేయాల్సి ఉందని అమీర్‌అలి తెలిపారు.

ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వినతి

మాచర్లరూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల ప్రభుత్వోన్నత పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారని, ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కోరారు. వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో హెచ్ఎం డీ జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

దుర్గి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని తేరాలలో జరిగింది. గ్రామానికి చెందిన నక్కా శివకృష్ణ సోమవారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి అదే గ్రామానికి చెందిన రాచమంటి శ్రీనివాసరావు గృహం వద్దకు చేరుకొని ఇంటి ముందు ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను రాడ్డుతో ధ్వంసం చేశాడు. ఇదేమని ప్రశ్నించిన శ్రీనివాసరావుపై కూడా గొడ్డలితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర ంగా గాయపడిన శ్రీనివాసరావును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం

పిడుగురాళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో మంగళవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ పీ.రవికుమార్ రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. సేవా కార్యక్రమాల్లోను ఎస్‌బీఐ ముందంజలో ఉంటుందని, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా బ్యాంకు పథకాలను అందరికీ చేరవేసేలా ఎస్‌బీఐ గ్రామస్థాయి వరకు పనిచేస్తుందన్నారు.

వ్యర్థాలకు నిలయంగా నాగులేరు

● గుర్రపుడెక్క పెరిగి పాచి పట్టిన తీరు
● కలుషితమైన భూగర్భ జలాలు


గుర్రపు డెక్క పెరిగి పాచి పట్టి వ్యర్థాలతో నిండిన నాగులేరు

దాచేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు చరిత్రకు సజీవ సాక్ష్యం, పల్నాటి వీరులు పుణ్య స్నానాలు ఆచరించిన పల్నాటి జీవనది, వందల ఎకరాలకు సాగు నీరు, వేలాది మంది ప్రజలకు తాగు నీరు, పశు పక్షాదుల దాహార్తిని తీర్చే నాగులేరుకు జీవకళ తప్పింది. కుళ్లిపోయిన కొబ్బరి బోండాలు, జంతు కళేబరాలు, దుకాణ వ్యాపార సంస్థల్లో వ్యర్థాలకు నాగులేరు నిలయంగా మారింది. నల్లమల అడవుల్లో జన్మించిన నాగులేరు చిన్న పాయగా ప్రారంభమై 30 కిలో మీటర్లు ప్రయానం చేసి కారంపూడి, దాచేపల్లి మండలాల్లో ప్రవహిస్తూ కృష్ణా నదిలో కలుస్తూ ఉప పాయగా నిలబడింది. ఈ నాగులేరు పరిసర ప్రాంతాల్లో ఉన్న మల్లె తోటలు, తమల పాకు తోటలు, మాగాడి భూములకు సాగు నీరు లభించేది ఈ నాగులేరు నుంచే. అదే విధంగా నాగులేరు పక్కన గ్రామాలైన కారంపూడి, పెదకొదంగుండ్ల, చిన కొదంగుండ్ల, బట్టువారిపాల్లె, గాదేవారిపాల్లె, ఇనుపరాజుపల్లె, కాసారం, గోగులపాడు, బూదవాడ, నడికూడి, కేసానుపల్లి, తక్కెళ్ళపాడు, దాచేపల్లి, శంకరాపురం, గామాలపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తూ నాగులేరు కృష్ణా నదిలో కలుస్తుంది. కాని ఇంత మందికి ఉపయోగపడుతున్న నాగులేరు నేడు వ్యర్థాలతో నిండి కుళ్లికంపు కొడుతుంది. అంతేగాకుండా భూగర్భ జలాలు కలుషితమై బోరులో నీరు కూడా మురికిగా మారాయి. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన పల్నాడు జీవనదిగా ఉన్న నాగులేరు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది. నాగులేరు పరిసరాల్లో ఇప్పటికే కొంత మేరకు ఆక్రమణలకు గురికావటం, మరి కొంతమేర సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీల్లో నుంచి వ్యర్థాలు కూడా వాగులోకి చేరటం నాగులేరులోని జలచరాలకు ప్రాణహాని కలుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం నాగులేరు పరిశుభ్రతకు, సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

పేదింటి తల్లుల ఆత్మగౌరవం తల్లికి వందనం

● సూపర్‌సిక్స్ హామీలన్నీ అమలు చేస్తాం
● తల్లుల ఖాతాలో రూ.10 వేల 91 కోట్లు జమ
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేదింటి తల్లుల ఆత్మగౌరవం తల్లికి వందనం పథకమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి బడులు తెరిచే సమయానికి సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకం అమలు చేసి నగదును తల్లుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. జగన్‌రెడ్డి పాలనలో 42 లక్షల 61 వేల 164 మంది విద్యార్థులకు అమ్మఒడి కింద రూ.5 వేల 540 కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం ద్వారా రూ.67 లక్షల 27వేల 164 మంది విద్యార్థులకు రూ.10వేల 91 కోట్ల నగదు ఖర్చు చేశామని వివరించారు. దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు అదనంగా అందించామని చెప్పారు. తల్లి విజయమ్మను గౌరవించలేని జగన్‌రెడ్డి తల్లికి వందనం పథకాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు.

ఎన్నికల హామీలు అమలు చేసి తీరుతాం

రాజకీయ కుట్రలు ఎన్ని చేసినా ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ఇచ్చిన హామీలు ఆగవని ఎమ్మెల్యే జూలకంటి భరోసా ఇచ్చారు. అలాగే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమలు కానున్నదని ధీమా వ్యక్తం చేశారు. జలజీవన్‌మిషన్ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధ జలాల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని భరోసా ఇచ్చారు. సమావేశంలో నేరేటి వీరాస్వామి, సింగారెడ్డి సుధాకర్‌రెడ్డి, పల్లె బుజ్జి, గొంటు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, కొమెర శివ, పంగులూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 33 మంది లబ్ధిదారులకు రూ.24.37 లక్షల విలువ చేసే సీఎం రిలీఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అనారోగ్యతో ఉన్న పేదలను ఆదుకోవడంతోపాటు వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ నగదు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

● కారంపూడి మండలానికి చెందిన సయ్యద్ వలికి రూ.20 వేలు, ఒప్పిచర్లకు చెందిన బచ్చు సుబ్బారావుకు రూ.37 వేలు మంజూరయ్యారు. బుధవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సీఎం రిలీఫండ్ చెక్కులను వారికి అందజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, ఎస్‌పీఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ లాకింగ్ బ్రిక్స్‌తో ఖర్చు ఆదా

తక్కువ ఖర్చుతో ఇంటర్ లాకింగ్ బ్రిక్స్‌తో ఇంటి నిర్మాణాలు పటిష్టంగా కట్టుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం ఆయన వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఇంటర్ లాకింగ్ బ్రిక్స్‌ను పరిశీలించి వివరాలను విలేకరులకు తెలిపారు. తక్కువ సమయం, లిమిటెడ్ మ్యాన్ పవర్‌తో ఇంటి నిర్మాణాలకు అవసరమైన బ్రిక్స్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలో వెల్దుర్తి, రెంటచింతల మండలాల్లో ఈ యూనిట్ నెలకొల్పేదుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

● ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ


అచ్చంపేటలోని ఎస్సీకాలనీ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న భూక్యా స్వర్ణమ్మ

అచ్చంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయులందరూ కష్టపడి పనిచేసి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని ఎస్సీ కాలనీలో ఉన్న మోడల్ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేసీహెచ్ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలల్లో హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులు కూడా కష్టపడి ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, అచ్చంపేట మాజీ సర్పంచ్ సందెపోగు వెంకయ్య, వెనిగండ్ల కోటయ్య, పాఠశాల చైర్మన్ సందెపోగు సాయికుమారి, వైస్ చైర్మన్ గుడ్లూరి అనూష, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో నేడు యోగాంధ్ర


బుద్ధవనంలో మాక్ యోగాలో పాల్గొన్న విద్యార్థులు

అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద బుధవారం ఉదయం 6గంటలకు రెండు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుంది. దీనికి సంబంధించి మంగళవారం బుద్ధవనంలో సుమారు 300మంది విద్యార్థులతో బుద్ధుడి విగ్రహం, యోగాంధ్ర, అమరావతి పేర్లతో ప్రదర్శన నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో పాటు ఇతర అధికారులు పాల్గొంటున్నారు. విద్యార్థులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొనేలా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకున్నారు.


ప్రతి విద్యార్థి ఉన్నత చదువే ప్రభుత్వ లక్ష్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట సుబ్బారావు


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, కూటమి నేతలు

పిడుగురాళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఉన్నత చదువే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకటసుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పాండురంగ శ్రీను, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు యేలూరి శశి, కామిశెట్టి రమేష్, సయ్యద్ అమీర్‌అలి, ఎల్‌పీఆర్, పిల్లి చెన్నారావు, పణితి రవి, అంజా సాహెబ్, దూదేకుల ఖాశింసైదా, వల్లెపు రామకృష్ణ, వడ్లమూడి వెంకయ్య తదితరులు మాట్లాడుతూ బడి ప్రారంభమైన మొదటి రోజే తల్లికి వందనం నగదు జమచేయడంతో పాటు పాఠ్యపుస్తకాలు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి పొందేందుకు రైతులకు సూచనలు


జానపాడులో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏవో సంధ్యారాణి, రైతులు, ఉద్యానశాఖ అధికారులు

పిడుగురాళ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న పంటలపై అధిక దిగుబడి పొందేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని వ్యవసాయ అధికారి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం జానపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి పత్తి పంటను పరిశీలించారు.

● మాచవరం (ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాలు, పురుగు మందులు, మందు కట్టలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకొని భద్ర పరుచుకోవాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆకురాజుపల్లి, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

● నకరికల్లు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు అధీకృత విత్తన దుకాణదారుల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏవో కే దేవదాసు సూచించారు. మంగళవారం గుండ్లపల్లి, బాలాజీనగర్ తండాలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

● సత్తెనపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్‌లో పత్తి, మిర్చి, వరి పంటలను సాగుచేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెద మక్కెన, గర్నెపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

● రాజుపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ కలిగిన షాపులలోనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏవో వెంకట నరసయ్య తెలిపారు. మండలంలోని నెమలిపురిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులను వేసుకొని భూసారాన్ని పెంచుకోవాలన్నారు.

● అమరావతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలని ఏడీఏ వీ హనుమంతరావు తెలిపారు. మంగళవారం అమరావతి, ధరణికోట గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఎస్‌కే ఎఫ్ అహ్మద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● అచ్చంపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తల, కోనూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఏవో వెంకటేశ్వర్లు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వేయాలనేది అధికారులు తెలియజేస్తారన్నారు.

● మాచర్లరూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో మంగళవారం ఏవో పాపకుమారి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

విద్యార్థినికి రూ.30వేలు చెక్కు అందజేత


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న మామిళ్ళపల్లి విజయలక్ష్మి

అచ్చంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ల చెరువు గ్రామానికి చెందిన ఎంకామ్ విద్యార్థిని మేదర భాను ప్రసన్నకు స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మామిళ్ళపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం చెక్కును అందించారు. మేదర భాను ప్రసన్న ఆంధ్రా యూనివర్సిటీలో ఎంకాం ద్వితీయ సంవత్సరం చదువుతుంది. యూనివర్సిటీలో సెకండ్ ర్యాంకు సాధించటంతో ఆమె ఖర్చుల నిమిత్తం వీటిని అందజేశారు. కార్యక్రమంలో స్నేహహస్తాల ఫైండేషన్ కో-ఆర్డినేటర్ కరీముల్లా బాబు తెలిపారు.

క్రోసూరులో నీటి ఎద్దడి నివారించాలి

● పంచాయతీ అధికారులకు మహిళల విజ్ఞాపన

క్రోసూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో తీవ్ర నీటి ఎద్దడి నెలకున్న నేపథ్యంలో చెరువును నింపాలని పలు కాలనీలకు చెందిన మహిళలు మంగళవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. చెరువులో నీరులేక పోవటంవల్ల బోర్లు ఎండి పోయాయని, బావుల్లో నీరులేదని, క్రోసూరు చెరువులో నీరులేని ప్రతిసారి ఈ విధంగా జరుగుతుందని మహిళలు పేర్కొన్నారు. నాలుగైదు రోజులకొకసారి ఒక ట్యాంకర్ నీరు పంపితే ఎలా అవసరాలు తీరుతాయని వారు ప్రశ్నించారు. చెరువును అభివృద్ధి పేరుతో నీరు నింపటంలో కాలయాపన చేయటం తగదన్నారు. మరో వైపు జల జీవన్ మిషన్ పేరుతో రోడ్లను తవ్వి వదిలి వేశారని, మహిళలు వినతిపత్రంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీవో రవికుమార్‌కు, పంచాయతీ అధికారి ఆదినారాయణకు వినతిపత్రం సమర్పించారు.

వ్యక్తిగత శుభ్రతతో అతిసార నివారణ

ముప్పాళ్ళ జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే అతిసారను నివారించవచ్చని డాక్టర్ రమాదేవి అన్నారు. ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అతిసార నియంత్రణ పై ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి జులై 31 వతేదీ వరకు అతిసార నివారణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలకు అతిసార రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాంతులు విరోచనాలు వస్తే వెంటనే స్థానికంగా ఉండే ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి వెళ్లి వైద్యం చేయించాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పీటర్ డామియేన్, జోస్ఫిన్‌రాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● క్రోసూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో అతి సార వ్యాధి వ్యాప్తిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు రాంబాబు నాయక్, డాక్టర్ సిరి చందన అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ పోస్టర్లను వారు విడుదల చేశారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ మాట్లాడుతూ సురక్షితమైన తాగునీరు తీసుకోవటంతో పాటు వ్యాధి సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాలల వద్ద పోస్టర్లను అతికించాలని సిబ్బందికి సూచించారు.

'తల్లికి వందనం'పై వైసీపీ విషం చిమ్మటం సిగ్గుచేటు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనంపై వైసీపీ శ్రేణులు విషం చిమ్మటం సిగ్గు చేటని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం పేర్కొన్నారు. కూటమి అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంతో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి వారి ఖాతాల్లో నగదు జమవ్వటంతో ప్రతి తల్లి సంతోషంగా ఉందన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతకమందికి ఒక్కొక్కరికి రూ.13వేలు ఇస్తుంటే ఇచ్చిన మాటను బట్టి ఒక్కరికి మాత్రమే అమ్మఒడి ఇచ్చిన వైసీపీ దీనిపై బురద చల్లటం విడ్డూరంగా ఉంద న్నారు. ఇచ్చిన హామీని అమలు చేయటం చేతగాని వైసీపీ నేతలు లోకేశ్ జేబులోకి రూ.2వేలు పోయాయని దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ ఆధారం లేని ఆరోపణలు చేస్తూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టు కున్నారని ప్రతి తల్లి ఆనందం వ్యక్తం చేస్తుంటే జగన్‌కు కడుపు మంటగా ఉందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేయటం మానుకోవాలన్నారు.

తల్లికి వందనం పేదలకు వరం

శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి


తల్లికి చెక్కును పంపిణీ చేస్తున్న మంజులారెడ్డి

రెంటచింతల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం కింద ప్రతి పేద ఎకౌంట్‌లో నగదు జమకావడంతో ఆ కుటుంబసభ్యుల మోముల నిండా ఆనందం వెల్లివిరుస్తుందని శిల్పారామం చైర్మన్ చేరెడ్డి మంజులారెడ్డి అన్నారు. మంగళవారం రెంటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.15 వేల నగదును వ్యక్తిగతంగా మంజులారెడ్డి అందచేశారు. హెచ్ఎం నాగభారతి అధ్యక్షత వహించిన సభలో విద్యార్థుల తల్లులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిచ్చిరెడ్డి, లింగారెడ్డి, వీవీ సుబ్బారావు, బ్రహ్మయ్య, రామాచారి, మల్లికార్జునరావు, కృష్ణారెడ్డి, పేరం సీతమ్మ, ఆర్యవైశ్య నేత కొత్త అంజి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'పై తప్పుడు ప్రచారం మానుకోవాలి

● రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాలను మానుకోవాలని రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే నగదు అందిస్తే కూటమి పాలనలో కుటుంబంలో చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. వైసీపీ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలను చేస్తున్నా రని విమర్శించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు అక్కల వెంకట రామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఓర్సు ఆనంద్, వెన్నా సీతారామిరెడ్డి, పీఎస్‌కే రసూల్, సర్పంచ్ జ్యోతి సముద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ 20వ వార్షిక వేడుకలు

● పేద విద్యార్థులకు ఆర్థిక సాయం ● గ్రామాల్లో మౌళిక సదుపాయాలు


పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ

రెంటచింతల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది ఒడ్డున గల సత్రశాలలోని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ 20వ వార్షిక వేడుకలు నేడు నిర్వహించనున్నారు. 19 సంవత్సరాల క్రితం నిర్మానుష్యంగా ఉన్న ఈ ప్రాంతం నేడు విద్యుద్దీప కాంతులతో ధగధగ లాడుతుంది.. వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఈ ఫ్యాక్టరీ ద్వారా లభించాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు వేయి మంది ఉపాధి పొందుతున్నారు. ప్రతి రోజు సుమారు 4వేల టన్నుల సిమెంట్ ఇక్కడ తయారౌతుంది. ఫ్యాక్టరీ పరిధిలోని అనేక గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మంచి నీటి ఎద్దడిని నివారించడం, వైద్య శిబిరాలు, సీసీ రోడ్లు వేయడం వంటి కార్యక్రమా చేపడుతున్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం చేస్తున్నారు. రూ.90 కోట్లతో ఫ్యాక్టరీ విస్తరణకు చేపట్టిన పనులు చివరి దశకు చేరినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు చెప్పారు.

గ్రంథసిరి లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్‌గా కిలారి రాజన్‌బాబు

అచ్చంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రంథసిరి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అధ్యక్షుడిగా సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు ను ఐడీసీ అధికారులు ఎంపిక చేశారు. ఆయనతో పాటు మరో 17 మంది కమిటీ సభ్యులు ఎంపికయ్యారు. ఈ స్కీమ్ ద్వారా మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రంథసిరి, విప్పర్ల, ఓర్వకల్లు, వేల్పూరు గ్రామాలతో పాటు చిగురుపాడు, కోనూరు, ఊటుకూరు గ్రామాల్లోని వ్యవసాయ భూములకు కృష్ణా జలాలు అందనున్నాయి. దీని ద్వారా మూడు వేల ఎకరాలకు నీరు అందించేందుకు ఐడీసీ అధికారులతో మరమ్మతుల నిమిత్తం రూ.55 లక్షలకు అంచనాలు సిద్ధం చేయించినట్లు రాజన్‌బాబు తెలిపారు. పనులను మంగళవారం ప్రారంభించామని, మూడు వేల ఎకరాలను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పనులను త్వరలో పూర్తి చేస్తామని అన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

గురజాలటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టులో జూలై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ప్రియదర్శిని అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీ పడదగిన సివిల్ కేసులను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ చలమరాజు, న్యాయవాదులు బీఎన్‌వీ హనుమంతురావు, ఎం శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యరాజు, ప్రభుదాసు, కుమారస్వామి, సుందర జ్ఞానమ్మ, ఎం ప్రసాదరావు, కర్రా చిన కోటేశ్వరరావు, సురేష్, మహ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.



డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పేరుతో స్టూడెంట్ కిట్టు

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యా వేత్తలు, మేధావులు, ప్రజా సంఘాలు

మహానుభావులకు.. పెద్ద పీట



బొల్లాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలపై ఏర్పాటు చేసిన బొమ్మలకు కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ముగింపు పలికింది. మహానుభావుల పేర్లకు పెద్ద పీట వేసింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పథకం పేరు నుంచి లోగో వరకు పారదర్శకంగా అందరికీ ఆమోద యోగ్యంగా రూపొందించటాన్ని విద్యా వేత్తలు, మేధావులు అభినందిస్తున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం పథకానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచన మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పేరుతో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. విద్యార్థులకు అందించే విద్యామిత్ర కిట్టుకు మహా పండితుడు, గొప్ప విద్యా వేత్త, భారత రెండవ రాష్ట్రపతి, ఉపాధ్యాయుల ఆరాధ్య దైవం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్రగా నామకరణం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న స్కూల్ బ్యాగ్‌లు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, సమ దుస్తులు, బూట్లు, బెల్టులు ఇలా అన్నింటిపై సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పేరు, ప్రభుత్వ లోగో తప్ప మరియే ఇతర బొమ్మలు లేకుండా చేశారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, యూనిఫాం, పంపిణీ చేసి విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారు.

పంటల సాగులో.. విత్తన ఎంపికే కీలకం



సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంటల దిగుబడుల్లో అత్యంత కీలకం మేలైన విత్తన ఎంపిక. సరైన విత్తనాన్ని ఎంచుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. నకిలీ, నాసిరక విత్తనాల ఎంపికతో చివరికి నష్టాలే మూట గట్టుకోవాల్సిన వస్తుంది. దీంతో ముందు నుంచే విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉండాలంటే ఎరువులు, పురుగు మందులతో పాటు విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో అనేక సందర్భాల్లో రైతులు నకిలీ, నాసిరకం విత్తనాలు సాగు చేసి నష్టాలను చవి చూశారు. నకిలీ కంపెనీల విత్తనాలపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఏటా తనిఖీలు చేస్తున్నప్పటికీ మార్కెట్‌లో వాటి జోరు తగ్గడం లేదు.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

పత్తి బీటీ - 3 రకం విత్తనాలు నిషేధించారు. వీటిని సాగు కూడా చేయకూడదు. పర్యావరణానికి పెను ముప్పుగా భావించి, ఈ రకం విత్తనాల సాగుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో గుట్టుగా బీటీ-3 పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు అక్కడక్కడా రహస్యంగా ఈ విత్తనాలను సాగు చేస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి : సుబ్బారెడ్డి, ఏవో, సత్తెనపల్లి

ఖరీఫ్ సీజన్‌కు విత్తనాల కొనుగోలులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలి. కొనుగోలు రసీదును తప్పనిసరిగా తీసుకుని, విత్తన నమూనా, ప్యాకెట్‌లను భద్రపరుచుకోవాలి. నాసిరకం, నకిలీ కంపెనీల విత్తనాలు అమ్మే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారిని గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై తయారీ తేదీ, పరీక్షించిన, గడువు తేదీలు సరిగా ఉన్నాయో చూసుకోవాలి. విత్తన సంచులు చినిగినా, రంధ్రాలు ఉన్నా తడిచినా కొనుగోలు చేయక పోవడం మంచిది. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమ శాతాన్ని కూడా చూసుకోవాలి.

అక్రమార్కుల వలలో చిక్కుకోవద్దు

గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వారి వద్ద రైతులు కొనుగోలు చేయకూడదు. నకిలీ కంపెనీల విత్తనాలను బ్రాండెడ్ అంటూ ఆకర్షణీయ ప్యాకింగ్‌తో విక్రయిస్తుంటారు. ఆయా గ్రామాల్లోని పెద్ద మనుషులతో సంప్రదించి.. రైతులందరూ విత్తనాలు కొనుగోలు చేసేలా ఒత్తిళ్లు తెస్తుంటారు. తక్కువ ధరకే అంటూ కొందరు లూజుగా విత్తనాలు అమ్ముతుంటారు.. ఇలాంటి వ్యక్తుల గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

బడి బ్యాగు...

బరువు తగ్గింది

❖ సెమిస్టర్ విధానంలో పాఠ్య పుస్తకాల ముద్రణ

❖ 1, 2 తరగతులకు ఒక పాఠ్య పుస్తకం, ఒకవర్క్ బుక్

❖ 3, 4, 5 క్లాసులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం

సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బ్యాగ్‌లో ప్రతి సబ్జెక్ట్‌కు ఒక పాఠ్య పుస్తకం తీసుకెళ్లే రోజులు పోయాయి. ప్రభుత్వం సెమిస్టర్ విధానం తీసుకు వచ్చి ంది. తెలుగు, హిందీ, ఆంగ్లం కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేయడం, ఒకటి నుంచి 9వ తరగతి వరకు రెండు మూడు సబ్జెక్టులు కలిపి ఒక పాఠ్య పుస్తకం తీసుకురావడంతో విద్యార్థుల బ్యాగ్ కొంత బరువు తగ్గింది. దీంతో విద్యార్థులు హాయిగా పాఠశాలకు వెళ్లగలుగుతారు. ఉదాహరణకు మూడు నుంచి ఐదు తరగతులకు తెలుగు, ఇంగ్లీషు కలిపి ఒక టెస్ట్ బుక్, గణితం, ఈవీఎస్ కలిపి ఒక టెస్ట్ బుక్, ఒక వర్క్ బుక్, కేవలం మూడు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ తీసుకు వెళితే సరిపోతుంది.

పాఠ్య పుస్తకాలు వివరాలు ఇలా...

ఒకటి, రెండు తరగతులకు సంబంధించి ఒక సెమిస్టర్‌కు తెలుగు, లెక్కలు, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్య పుస్తకం, ఒక వర్క్ బుక్ ఇచ్చారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్య పుస్తకం, లెక్కలు, ఈవీఎస్ కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేశారు. దీంతో పాటు వర్క్ బుక్ ఇచ్చారు. 6, 7 తరగతుల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్య పుస్తకం చేశారు. లెక్కలు, సైన్స్, సోషల్ పాఠ్య పుస్తకాలు విడివిడిగా ఇచ్చారు. 8, 9 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్య పుస్తకం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం కలిపి ఒకటి, లెక్కలు ఒక పాఠ్య పుస్తకం, సోషల్, సైన్స్ ఒక పాఠ్య పుస్తకంగా ఇచ్చారు. 9వ తరగతికి అదనంగా ఆంగ్ల పదాలు, వ్యాకరణకు సంబంధించి ఒక వర్క్ బుక్ ఇచ్చారు. 10వ తరగతిలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు, భౌతిక శాస్త్రం, లెక్కలు జీవ శాస్త్రం, సోషల్ సైన్స్‌లో చరిత్ర, భూగోళ రాజకీయ ఆర్థిక శాస్త్రం పాఠ్య పుస్తకాలు విడిగా ఇచ్చారు.



పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు

తల్లికి వందనం..

ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం

● ఎక్కువగా సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ అనర్హత అర్జీలే

● హౌస్‌హోల్డ్ నుంచి విభజించాలని విజ్ఞప్తులు

● తమకు ఆ అవకాశం లేదంటున్న సచివాలయాల ఉద్యోగులు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకానికి సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ గ్రామ/వార్డు సచివాలయాల్లో సిబ్బంది ప్రారంభించారు. ఇప్పటికే సచివాలయాల వారీగా ఈ పథకానికి అర్హులు, అనర్హుల జాబితాలను ప్రచురించారు. అలానే వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. ఈ జాబితాల్లో లేని విద్యార్థుల తల్లులు స్కూల్ ఐడీ, పాఠశాలలో గత రెండేళ్ల పిల్లల హాజరు శాతం, తల్లి, బిడ్డ ఆధార్‌లు, రైస్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్లను తీసుకొని సచివాలయాలకు వస్తే ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి అర్జీలు పంపిస్తామని సిబ్బంది చెబుతున్నారు. దీంతో అర్హత ఉండి ఎవరికైతే తల్లికి వందనం నగదు జమ కాలేదో ఆ తల్లులు సచివాలయాలకు వెళ్లి అర్జీలు దాఖలు చేస్తున్నారు.

అర్హులై ఉండి..నగదు జమకాకుంటే..

ఒక కుటుంబంలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం కింద రూ.13 వేల చొప్పున నగదుని నేరుగా తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ఈ పథకం కింద గుంటూరు జిల్లాలో 2,01,911, బాపట్లలో 1,45,009, పల్నాడులో 2,47,393 మంది విద్యార్థులకు రూ.13 వేల వంతున వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. అర్హుల జాబితాలో ఉండి నగదు జమ కాకపోతే బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐకి లింకు చేసుకోవాల్సిందిగా సూచించింది. ప్రభుత్వం నగదు మొత్తాన్ని ఎన్‌పీసీఐకి డిపాజిట్ చేయగా ఆ సంస్థ రోజుకు కొన్ని లక్షల మందికి నగదుని జమ చేస్తోంది. చాలా మందికి మంగళవారం కూడా బ్యాంకు ఖాతాల్లో నగదు డిపాజిట్ అయింది.

ఆ ఆప్షన్ సచివాలయ ఉద్యోగులకు లేదు

హౌస్‌హోల్డ్ డేటాలో లోగడ ఉమ్మడి కుటుంబాలు ఉన్నాయి. తల్లి, తండ్రి, పిల్లల్లో ఏ ఒక్కరు సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌లో అనర్హులైనా.. ఆ కుటుంబంలో అర్హులున్నా తల్లికి వందనం నగదు జమ కావడం లేదు. దాంతో హౌస్‌హోల్డ్ డేటాలో తమ కుటుంబం వరకు విభజించాలని చాలామంది అర్జీలు ఇస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ఆప్షన్ సచివాలయాల సిబ్బందికి ఇవ్వలేదు. ప్రస్తుతం హౌస్‌హోల్డ్ డేటాలోకి కేవలం చేర్పులు చేసే అవకాశం మాత్రమే కల్పించారు. తొలగింపులు అవకాశం ఇచ్చినప్పుడు చెబుతామని, అప్పుడు రావాల్సిందిగా చెప్పి పంపేస్తున్నారు.

అనర్హుల సమస్యలకు పరిష్కారాలు..

● సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ డేటా గతేడాదే ప్రామాణికంగా తీసుకోవడం వల్ల కొంతమందిని అర్హత ఉన్నప్పటికీ అనర్హుల జాబితాలో చేర్చారు. విద్యుత్ నెలకు సగటు వాడకం 300 యూనిట్ల లోపు ఉంటే.. తల్లి ఆధార్, రైస్‌కార్డు, ఫోన్ నంబరు, ఏపీ సీ పీడీసీఎల్ డీఈఈ నుంచి ఒక సంవత్సరం విద్యుత్ బిల్లు సగటు 300 యూనిట్ల కంటే తక్కువ ఉన్నట్లు ఆకుపచ్చ ఇంకు పెన్నుతో సంతకం చేయించి, స్టాంప్ ముద్ర వేయించి అందజేయాలి.

● ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లుగా తప్పుగా చూపిస్తే ఆధార్ నంబరు, రైస్‌కార్డు, చార్టెర్డ్ అకౌంటెంట్ నుంచి ఫాం-26 ఏఎస్ పత్రాలను నివేదించాలి.

● రైస్‌కార్డు ఉన్నా లేనట్లు అనర్హుల జాబితాలో ఉంటే ఆధార్, రైస్‌కార్డు, ఫోన్ నంబరు ఇవ్వాలి.

● నాలుగు చక్రాల సొంత వాహనం లేకపోయినా ఉన్నట్లు ఉంటే.. రవాణ శాఖకు వెళ్లి సర్టిఫికెట్ తెచ్చుకోవాలి.

● గ్రామీణ/పట్టణ ప్రాంతాల్లో అనుమతికి లోబడే స్థలాలు ఉన్నప్పటికీ.. అనర్హుల జాబితాలో ఉంటే నేరుగా సచివాలయాల్లోనే సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేయాలి.

● ప్రభుత్వ ఉద్యోగులైతే తల్లికి వందనం పథకానికి అనర్హులు.



మల్కాపురం గ్రామ సభ రసాభాస

● ఆలయ నిర్మాణంపై వాదోపవాదనలు

తుళ్లూరు, (మాల్కాపురం), జూన్ 17,(ఆంధ్రజ్యోతి) : ఆలయ నిర్మాణ విషయంలో ప్రజాభిప్రాయం కోసం మల్కాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళ ఏర్పాటు చేసిన గ్రామ సభ రసాభాసగా మారింది. గత నెల 31న హైద్రాబాద్‌కు చెందిన భవాని అనే మహిళ మల్కాపురం సుగాలి కాలనీలో ఉన్న రాణిరుద్రమ్మ దేవి నాటి శిలాశాసనం, సుబ్రమణ్యస్వామి ఆలయ ఉన్న చారిత్రాత్మక ప్రదేశంలో శివాలయం నిర్మించడానికి శంకుస్థాన చేశారు. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సుగాలి కాలనీ వాసులను ఖాళీ చేయించి.. గుప్త నిధులు కైవసం చేసుకోవాలనే ఆలోచనతోనే.. గ్రామస్తులకు తెలపకుండా శంకుస్థాపన చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయం కోసం కార్యదర్శి సాంబశివరావు గ్రామ సభను ఏర్పాటు చేయగా.. గ్రామస్తులకు వాదోపవాదాలు జరిగి గందరగోళం నెలకొంది. తమకు పట్టాలున్నాయని, ఆలయం నిర్మాణం అంటూ ప్రతిసారి ఖాళీ చేయాలని తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సుగాలి కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రాత్మక ప్రదేశంలో ఆలయ నిర్మాణం చేయడానికి అభ్యంతరం లేదని, అయితే ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎండోమెంటు, పురావస్తు శాఖ అనుమతులతో చేపట్టాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇందుకు గ్రామస్తులతో కమిటీ వేయాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రదేశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు సందర్శించి, రాణి రుద్రమ్మ దేవీ శిలా శాసనం వద్ద ఆమె జయంతి సందర్భంగా కొబ్బరికాయ కొట్టారని గుర్తుచేశారు. దీనిని ఒక చారిత్రాత్మక ప్రదేశంగా తీర్చి దిద్దాలని, కాలనీ వాసులకు మెరుగైన సౌకర్యాలతో నివాసాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చంద్రబాబు సూచించారని చెప్పారు. తాను బాబా వారి భక్తురాలినని... కలలో ఆయన ఆలయ నిర్మాణం చేయాలని సూచించినట్టు భవానీ గ్రామ సభలో తెలిపింది. తనకు ఎటువంటి దురుద్దేశం లేదని చెప్పింది. రూ.50 లక్షల వరకు ఆలయ నిర్మాణానికి ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. స్పెషలాఫీసర్ రేష్మా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గ్రామ సభలో వాదులాడుకుంటున్న గ్రామస్తులు

మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు స్వల్ప అస్వస్థత

● జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ జిల్లా జైల్లో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. తనకు కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని జైలు అధికారులకు నందిగం ఫిర్యాదు చేశారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు జైలులో డాక్టర్ లక్ష్మీప్రియ మాజీ ఎంపీని పరీక్షించారు. ఆమె ఎటువంటి ఇబ్బందికర పరిస్థితిని గుర్తించలేదు. అయినప్పటికీ నిందితుడు సురేష్ తనకు కడుపు నొప్పిగా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో నందిగంను జిల్లా జైలు నుంచి జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీ చేసి నార్మల్‌గా ఉందని తెలిపారు. రాత్రి సురేష్‌కు కార్డియాలజిస్ట్ పర్యవేక్షణలో ఎకో పరీక్షలు చేస్తున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ స్పందిస్తూ.. మాజీ ఎంపీ సురేష్ ఆరోగ్యం పూర్తి నిలకడగా ఉందని తెలిపారు. విషయం తెలియగానే నందిగం సతీమణితో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు హాస్పిటల్‌కు చేరుకున్నారు. స్వగ్రామం ఉద్దండ్రా యునిపా లెంలో టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజుపై హత్యాయత్నం కేసులో.. గత నెల 19 నుంచి నందిగం గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు.



నందిగం సురేష్‌ను వైద్య పరీక్షలకు తీసుకువెళుతున్న పోలీసులు

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

గుంటూరు/సత్తెనపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి మునిసిపాలిటీకి చెందిన 17, 18, 21, 22 వార్డుల వైసీపీ కౌన్సిలర్లు సెగ్గెం పద్మావతి, తోట వెంకట సుధారాణి, కాకుమాను రవికుమార్, శెట్టి ఆనంద్‌కుమార్ మంగళవారం టీడీపీలో చేరారు. గుంటూరులోని కన్నావారి తోటలో నున్న క్యాంపు కార్యాలయంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో నలుగురు కౌన్సి లర్లు టీడీపీలో చేరి ఆ పార్టీకి జలక్ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉన్నారు.



గుంటూరులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

జగన్ తీరుపై కేడర్‌లో అసహనం

సత్తెనపల్లి, నరసరావుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్ జగన్ పరామర్శల పర్యటనలపై ఆ పార్టీ కేడర్ లోనే అసహనం నెలకొంది. ఇప్పటికే తెనాలిలో రౌడీషీటర్ల కుటుం బసభ్యుల పరామర్శపై ఆ పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రాకముందు ఎన్నిక ల్లో బెట్టింగ్‌లకు పాల్పడి ఆత్మహత్య చేసుకున్న సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల మాజీ ఉపసర్పంచ్ నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను ఏడాది తర్వాత పరామర్శించేందుకు జగన్ రానుండ టంపైనా ఆ పార్టీ కేడర్‌తో పాటు సామాన్య ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. రెంటపాళ్లలో కార్యక్రమం జరిగే ప్రాంతం ఇరుకుగా ఉంటుంది ఎక్కువ మంది వస్తే ప్రమాదం.. వంద మంది, మూడు వాహనాలతో రావొచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నా భారీగా జనసమీకరణకు వైసీపీ నేతలు సిద్ధమవుతుండటంపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తెనాలి పరామర్శలపై ప్రజల నుంచి వస్తున్న విమర్శలకు సమా ధానాలు చెప్పుకోలేక పోతున్న క్రమంలో రెంటపాళ్లకు జగన్ రాకపై వైసీపీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఇక నాగమల్లేశ్వరరావు గత ఎన్నికల్లో జగన్‌దే అధికారమని రూ.4 కోట్లు బెట్టింగ్‌లు కాసి.. 2024 జూన్ 4 కౌంటింగ్ రోజునే ఊరు వదిలి పారిపోయి.. 5న మేడికొండూరు సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి గుంటూరులో చికిత్స పొందుతూ 9న మృతి చెందాడు. ఈ మేరకు అదే నెల 10న పోలీసులు కూ డా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అతడి ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వానికి సంబంధం ఏమిటని, కూటమి ప్రభుత్వం రాక ముందు ఘటన జరగ్గా.. ఇప్పుడు జగన్ పరామర్శకు రావడంలో ఏమైనా అర్థం ఉందాని సామాన్య ప్రజలతో పాటు, వైసీపీ క్యాడర్ కూడా ప్రశ్నిస్తోంది. నాగమల్లేశ్వరరావు మృతి సమయంలోనే ఆ పార్టీ నేతలు, స్థానిక ఎమ్మెల్యే అంబటి రాం బాబు ఎందుకు పరామర్శించలేదని కూడా గ్రామస్తులతో పాటు ఆ పార్టీ నాయకులు కూడా ప్రశ్నిస్తున్నారు. సంవత్సరం తర్వాత జగన్ నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యపై హడావుడి చేయడంలో కుట్రకోణంపైనా కూడా ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా రు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఇటీవల శాంతిభద్రతల సమస్య నెలకొన్న నేపథ్యంలో రెంటపాళ్ల పర్యటనకు ఆంక్షలతో పోలీసులు అనుమతించినా జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్ర భుత్వం కుట్రలు చేస్తోందని ఆ పార్టీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ఆరోపించడంపైనా కేడర్ ముక్కున వేలేసుకుంటోంది.

అరాచకాలను ప్రోత్సహించడానికే పర్యటన : కన్నా

అరాచకశక్తులకు ప్రోత్సహించడానికే జగన్ పర్యటనలు చేస్తు న్నారని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. నాగమల్లేశ్వరరావు మృతికి వైసీపీ నేత జగనే కారణమని ఆరోపించారు. ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్‌లు కట్టి నష్టపోయి ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

ఎరువుల నిల్వలు.. పుష్కలమేనా..!

(5వ పేజీ తరువాయి)

దళారులు సొమ్ము చేసుకోవడం గత ప్రభుత్వంలో యథేచ్ఛగా సాగింది. ముఖ్యంగా డీఏపీ విషయంలో ఈ తంతు పెద్ద ఎత్తున నడిచేది. ఎంఆర్‌పీ కన్నా దాదాపు రూ.50లు అదనంగా వసూలు చేసి అన్నదాతలను నిలువునా వంచించారు. ప్రస్తుతం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత రానివ్వకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. కానీ అందుకు తగినట్లుగా సంబంధిత వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా లేదా అనేదే ఇక్కడ తలెత్తుతున్న ప్రశ్నగా ఉంది. ఖరీఫ్ పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఇందుకు తగినట్లుగా మార్క్‌ఫెడ్ నిత్యం ఎరువుల లభ్యతపై దృష్టిపెట్టాల్సి ఉంది. రైతు సేవా కేంద్రాలతో పాటు సొసైటీలలో ఉన్న నిల్వలపై వారాంతపు సమీక్షలు నిర్వహించి డిమాండ్‌కు అనుగుణంగా నిల్వలు పెంచుకునే కసరత్తు క్రమం తప్పకుండా చేయాల్సి ఉంది. సమాంతరంగా బయటి మార్కెట్‌లో ఉన్న ఎరువుల నిల్వల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై సంబంధిత వ్యవస్థలు కొరడా ఘుళిపిస్తేనే ఎరువుల పంపిణీ సజావుగా జరిగి అన్నదాతకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

లైసెన్సులు రద్దు చేస్తాం

ఎరువుల క్రయవిక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే లైసెన్సులు రద్దు చేయడానికి కూడా వెనకాడబోమని తాజాగా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. వ్యాపారులు ఎరువుల అమ్మకాల్లో కచ్చితంగా ఈ-పోస్ ద్వారా రియల్ టైం స్టాక్ రసీదు విధానం పాటించాలనే ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. దీని ద్వారా ఎరువుల నిల్వలు ఎంతమేర ఉన్నాయనే సమాచారం తెలుసుకోవడం వ్యవస్థలకు తేలికవుతుందనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు పర్యవేక్షించాలని కూడా ప్రభుత్వం తెలిపింది. కానీ సీజన్ ఆరంభంలో ఇలాంటి హడావిడి మామూలే అన్న ధోరణిలో వ్యాపారుల వైఖరి ఉంటుంది. గడచిన మూడేళ్లలో ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు సంబంధించి ఎన్ని షాపుల మీద చర్యలు తీసుకున్నారనేదానికి ఆయా విభాగాల వద్ద సమాధానమే కొరవడింది.

వైసీపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసింది: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే రైతులకు ఈ దుస్థితి నెలకొన్నదని, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో విమర్శించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లలో భాగంగా విశాఖలో ఉన్న ఆయన ఒక ప్రకటనలో రైతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో నిరసన తెలిపే వరకు రైతులకు పంటల బీమా సొమ్ము ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొని సకాలంలో సొమ్ము చెల్లించామని వివరించారు. చనిపోవటం సమస్యకు పరిష్కారం కాదన్నారు. అన్నదాతల ఆత్మహత్యలు బాధాకరమని ఆయన వివరించారు. మృతిచెందిన కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం కింద ఆర్థికసాయం చేసి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే: మాజీ మంత్రి విడదల రజిని

నాదెండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడటాన్ని ప్రభుత్వ హత్యలుగా భావిస్తున్నామని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో ఉన్న మృతదేహాలను ఆమె పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేతగానితనం వల్లే రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పించలేకపోవటం వలనే ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని విమర్శించారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు లేకనే నాదెండ్ల రైతుల బలవన్మరణాలు

● డాక్టర్ కొల్లా రాజమోహన్

చిలకలూరిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు లేనందువల్లనే నాదెండ్ల మండలంలో ఇద్దరు రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ మంగళవారం ఆంధ్రజ్యోతితో అన్నారు. నల్లబర్లీ రైతుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని, పొగాకుకు ధర లేదని, ఇక పొగాకును అమ్మలేమని, అమ్మినా ఖర్చులు కూడా రావని పొగాకును పొలంలో చిమ్మేస్తున్నారని చెప్పారు. పొగాకు పొలంలో చిమ్మితే కనీసం ఎరువు గానైనా పనికి వస్తుందని రైతుల అభిప్రాయంగా ఉందన్నారు. నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్ప వాస్తవంలో కొనుగోలు జరగటం లేదని విమర్శించారు. పొగాకు కొనుగోలు తేదీలుగా ఈ నెల 5, 10, 17గా ప్రకటించారని, అయితే మార్క్‌ఫెడ్ మాత్రం రంగంలోకి రాలేదని చెప్పారు. రైతులు అష్టకష్టాలు పడి, అప్పులుచేసి పొగాకు పండిస్తే, ఆ పొగాకును కొనుగోలు చేయాల్సిన కంపెనీలు నాణ్యమైన పొగాకు మాత్రమే తీసుకురమ్మని, పొగాకును కొనుగోలు చేయకుండా తిప్పి పంపుతున్నారని తెలిపారు. అత్యవసరంగా రంగంలోకి దిగి పొగాకు రైతులను రక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అరకు కాఫీ అవుట్‌లెట్‌ల స్థాపనకు ప్రభుత్వ రాయితీ

నరసరావుపేట రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అరకు కాఫీ అవుట్‌లెట్‌ల స్థాపనకు ప్రభుత్వం 35శాతం రాయితీ కల్పిస్తోందని జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల పథకంలో భాగంగా ఈ అవుట్‌లెట్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రాజెక్టు విలువ గరిష్ఠంగా పది లక్షల రూపాయలవరకు ఉండవచ్చన్నారు. ఈ ప్రాజెక్టు విలువలో 35శాతం రాయితీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా కాఫీ షాపు నిర్మాణానికి షాపునకు అవసరమైన ప్రాసెసింగ్ పరికరాలు, పాత్రలు, ఉపకరణాలు కొనుగోలుకు మాత్రమే రాయితీ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక జిల్లాలోని సెర్ప్‌కు అప్పగించడం జరిగిందన్నారు. ఈ పథకం వినియోగించుకునే ఉత్సాహవంతులు ఎవరైనా సంబంధిత జిల్లా మండల సెర్ప్ సిబ్బంది లేదా ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్‌పర్సన్‌లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ పథకం కింద డ్వాక్రా సభ్యులు, యువత, సామాజిక సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నూజెండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రావులపల్లి నాగేశ్వరరావు వ్యక్తిగత పనుల నిమిత్తం వినుకొండ వెళ్లి వస్తుండగా మంగళవారం గుర్రపునాయుడుపాలెం సమీపంలో మోటారు సైకిల్ అదుపు తప్పి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అగ్ని బాధితులకు నిత్యావసరాలు అందజేత

ఈపూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపువారిపాలెంలో కోంద్రు వెంకాయమ్మకు చెందిన గృహం కాలిపోయింది. ప్రభుత్వం తరుపున నిత్యావసరాలు, ఆర్థికసాయంను సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఆర్ఐ పీ రామారావులు మంగళవారం అందజేశారు.

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్

రొంపిచర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులపాడులోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన పూజల్లో ఇద్దరు పాల్గొన్నారు. అనంతరం కోలాట కార్యక్రమాన్ని వీక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. వీరి వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రధాన రహదారులకు మహర్దశ

● రూ. 13కోట్లతో నిర్మాణం ● గ్రామస్థుల హర్షాతిరేకాలు



ఆరు కోట్ల రూపాయలతో నిర్మించిన కారంపూడి- వెల్లటూరు రోడ్డు



వినుకొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్ వినుకొండ ఎమ్మెల్యే జీవీ చొరవతో నియోజకవర్గంలోని పలు గ్రామాలను అనుసంధానించే రహదారులకు మహర్దశ పడుతోంది. మండలంలోని నరగాయపాలెం, జాలపాలెం గ్రామాలతో పాటు, తిమ్మాయిపాలెం, భారతాపురం, శ్రీరామ్ నగర్, పానకాలపాలెం, దొండపాడు, నడిగడ్డ గ్రామా రహదారిలో ప్రయానించాలంటే నరకం చూసే పరిస్థితి. నరగాయపాలెం, జాలపాలెం గ్రామాలకు కనీసం రోడ్డులేక పోవడంతో ఆ పల్లెవాసులు పట్టణాలకు వలసవచ్చి జీవనం సాగిస్తున్న పరిస్థితి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వినుకొండ ఎమ్మెల్యే జీవీ కేవలం ఆరు నెలల వ్యవధిలో కారంపూడి రోడ్డు నుంచి నరగాయపాలెం, జాలపాలెం గ్రామాలను కలుపుతూ సుమారు రూ.6కోట్లు రూపాయలు వెచ్చించి వెంకుపాలెం గ్రామ సమీపం నుంచి వెల్లటూరు రోడ్డు అనుసంధానం చేస్తూ తారురోడ్డు నిర్మించడంతో ఆప్రాంత ప్రజల రాకపోకలకు మార్గం కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ నుండీ తిమ్మాయిపాలెం రోడ్డును నాబార్డు నిధులతో సుమారు 7 కోట్లు రూపాయలు వెచ్చించి తారు రోడ్డు నిర్మించడంతో వినుకొండ నుంచి తిమ్మాయిపాలెం, కుమ్మరిపాలెం, భారతాపురం, దొండపాడు, నడిగడ్డ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





నూతనంగా నిర్మించిన తిమ్మాయిపాలెం తారు రోడ్డు

చరిత్రలో నిలిచిపోయేలా యోగాంధ్రకు ఏర్పాట్లు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. విశాఖలో ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర-2025 కార్యక్రమంపై విశాఖలో వీఎం ఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి భీమిలీ నియోజకవర్గం యోగాంధ్ర-2025 ఇన్ చార్జిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రతిష్టను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటి చెప్పే అవకాశంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల సమన్వయంతో, ముఖ్యంగా స్థానిక సంస్థల, స్వచ్ఛంద సంస్థలతో యువత, విద్యార్థులు కలిసి పనిచేయడం ద్వారా కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. యువత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని, యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌలభ్యం కోసం అధికారులు, పోలీస్ శాఖ కలిసి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.



యోగాంధ్ర కార్యక్రమంపై విశాఖలో ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ప్రజా ప్రతినిధులు

తల్లికి వందనం నిధుల జమపై హర్షాతిరేకాలు

చిలకలూరిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం నిధులు జమ అవ్వటంపై చిలకలూరిపేటలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో 9,827 మందికి రూ. 13,000 చొప్పున రూ.12,77,51,000లు తల్లుల ఖాతాలలో జమ అయ్యాయని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మంగళవారం తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుల చిత్రపటాలకు చైర్మన్ రఫాని, టీడీపీ కౌన్సిలర్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రఫాని మాట్లాడుతూ పేద కుటుంబాల వారు ఈ పథకంపై ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అనేక పేద కుటుంబాలకు పాఠశాలలు తెరిచే సమయంలో అందిన తల్లికి వందనం మొత్తాలు చాలా ఉపయోగకరం ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, కె.తిరుమల, షేక్ నసీమా బేగం, కూనల ప్రమీల, జంగా సుజాత, ఆర్.హరిత పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ రఫాని

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండటౌన్, జూన్-17, (ఆంధ్రజ్యోతి) ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని కారంపూడి రోడ్డులోని దర్గా వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాను పరిశీలిస్తే క్యాటరింగ్ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వినుకొండకు వస్తూ మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో నల్లబోతుల రంగయ్య (18) అక్కడికక్కడే మృతి చెందగా, అతని సోదరుడైన రాజుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లోని మార్చురీకి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు వెన్ను పోటు పొడిచిన ఎన్డీఏ ప్రభుత్వం

వినుకొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వెన్నుపోటు అనే పుస్తకాన్ని బొల్లా బ్రహ్మనాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందాలంటే లంచాలు ఇవ్వాల్సి వస్తోందన్నారు. బ్యానర్లు కడితే వైసీపీ నాయకులపై కేసులు పెడుతున్నారన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలంటూ ప్రచారం చేస్తున్న యడ్లపాడు జడ్పీ హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● హెచ్‌ఎం విజయభారతి

యడ్లపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదవుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం విద్యార్థులకు అందించే అన్ని పథకాలు వర్తిస్తాయని యడ్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం విజయభారతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే లక్ష్యంలో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పాలంటూ యడ్లపాడు జడ్పీ హైస్కూల్ ప్లస్‌కు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ యడ్లపాడు హైస్కూల్‌లో బాలికలకు ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీషు మీడియంలో కోర్సులు ఆఫర్ చేయడం జరుగుతున్నదన్నారు. గత ఏడాది 80శాతం పైగా ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. ఇక్కడ చేరిన వారికి ఉచిత విద్య, బస్సు పాసులు, నోటు పుస్తకాలు, సన్న బియంతో మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. అంతేగాకుండా తల్లికి వందనం పథకం కింద రూ.13వేలు ఇస్తున్నారన్నారు. అర్హత కలిగిన అధ్యాపకులతో విద్యను బోధిస్తున్నామన్నారు. పదో తరగతి పాసైన బాలికలు ప్లస్‌టూలో చేరాలని ప్రచారం నిర్వహించారు. అలాగే పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల వరకు బాలబాలికలకు ఇంగ్లీష మీడియంలో బోధన జరుగుతోందన్నారు.

రైతుల బలవన్మరణాలకు వైసీపీ విధానాలే కారణం

● టీడీపీ నేతలు

చిలకలూరిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రైతు వ్యతిరేక విధానాల వల్లనే రైతుల బలవన్మరణాలు జరుగుతున్నాయని చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు మంగళవారం అన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వారు నాదెండ్ల మండలంలో ఇద్దరు రైతుల బలవన్మరణాలకు అన్ని విధాలుగా వైసీపీ విధానాలే కారణమన్నారు. రైతులకు విత్తనాలను సకాలంలో అందించే విషయం నుంచి ఇన్ పుట్ సబ్సిడీ అందించే వరకూ అన్ని విధాలుగా వైఫల్యం చెందారని, నాటి ప్రభుత్వ పాపాల ఫలితంగా అప్పుల పాలైన రైతులు, తప్పని పరిస్థితుల్లో ఇప్పుడు బలవన్మరణానికి పాల్పడితే, మరణాలను కూడా రాజకీయం చేయాలి అని మాజీమంత్రి రజిని అనుకోవడం మరీ దారుణం అన్నారు. ఇటువంటి డ్రామాలకు తెరదించాలని వారు రజినీని కోరారు. విశాఖపట్నంలో ఉన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆదేశాల మేరకు మృతుల కుటుంబ సభ్యులను తామంతా కలిసి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియచేసి, ప్రభుత్వం ద్వారా అందాల్సిన సాయాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి అధికారులతో మాట్లాడి ప్రమాద బీమా ద్వారా రూ.7.50 లక్షల సాయం ఒక్కో కుటుంబానికి అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. రైతుల కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా ప్రత్తిపాటి సంతాపం తెలియచేశారని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, అంబటి సోంబాబు, దగ్గుమల్లి సాంబశివరావు, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

● గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులకు ఎక్కడైనా గుర్తింపు ఉంటుందని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో గల రామిరెడ్డి ఉన్నత పాఠశాల, కాసు బ్రహ్మానందరెడ్డి రాఘవమ్మల ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న తొమ్మిది మంది ఉపాధ్యాయులకు మంగళవారం సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనన్నారు. బదిలీ అయిన వారు పాఠశాలలో చదివే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యాబోధనచేసి 10వ తరగతి ఫలితాల్లో పల్నాడు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషిచేశారన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి వెళ్ళే విధంగా లక్ష్యాలు కలిగి చదువు కోవాలన్నారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులను రామిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషోర్, కొండవీడు అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, పెద్దలు యన్నం శివారెడ్డి, వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ గాదె బ్రహ్మరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్విద్య ప్రదర్శనకు సుబ్బారావుకు తానా ఆహ్వానం

నరసరావుపేట టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): లింగంగుట్ల సుబ్బారావు వృత్తి రీత్యా అర్చకుడు, ప్రవృత్తి రీత్యా శబ్దభేది ధనుర్విద్య కళాకారుడు. లింగంగుట్ల సుబ్బారావుకు అమెరికాలో 2025 జూలై 3, 4, 5 తేదీలలో ధనుర్విద్య ప్రదర్శనకు అమెరికానుంచి తానా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో లింగంగుట్ల సుబ్బారావు బుధవారం అమెరికా బయలుదేరి వెళ్ళుతున్నారు. ఈ సందర్భంగా లింగంగుట్ల సుబ్బారావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తనది నరసరావుపేట మండలం అర్వపల్లి అన్నారు. తన నైపుణ్యాన్ని గుర్తించి మాజీమంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అనేక ప్రాంతాలలో ప్రదర్శనకు ప్రోత్సహించారన్నారు. తానాలో ప్రదర్శనకు 2016 సంవత్సరంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు అర్వపల్లి నుంచి అమెరికాకు పంపించారని చెప్పారు. ప్రస్తుతం ఆయన తనయుడు డాక్టర్ కోడెల శివరామకృష్ణ కూడా అమెరికా పర్యటనకు సహాయ సహకారాలు అందించారని తెలిపారు.



లింగంగుట్ల సుబ్బారావు (ఫైల్ ఫొటో)

ఎంఎస్ఎంఈ పార్కులో శిలాఫలకం ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం

బొల్లాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూ.7 కోట్లతో చేపట్టిన ఎంఎస్ఎంఈ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన బొల్లాపల్లిలో జరిగింది. ఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గత నెల మే 1వ తేదీన ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు పోలీసులను కోరారు.

వైసీపీ తప్పుడు ప్రచారంతో విద్యార్థులకు తీరని ద్రోహం

● నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్

నరసరావుపేట టౌన్, జూన్ 17: ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.2వేలు లోకేశ్ జేబులోకి పోయాంటూ వైసీపీ ఆరోపించడం వాళ్ల దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. వైసీపీ పాలనలో అమ్మఒడి కింద రూ.13వేలు ఇచ్చారు. అంటే రూ.2వేలు జగన్‌మోహన్‌రెడ్డి జేబులోకి పోయాయా?, తాడేపల్లి ప్యాలేస్‌కు చేరాయా అని ప్రశ్నించారు. వైసీపీ ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలకు గుండుసున్నా పెట్టి ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడవడానికి సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా తల్లికి వందనంతో రాష్ట్ర వ్యాప్తంగా 67లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో డబ్బులు పడటంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషంగా ఉంటే కేవలం అవినీతి ఆరోపణలు చేయడం గందరగోళ వాతావరణం సృష్టించడమే జగన్‌మోహన్‌రెడ్డి ఎజెండాగా మారిపోయిందని విమర్శించారు.



ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసరావుపేట ఆర్డీవో మధులత

25లోపు బనకచర్ల ప్రాజెక్టు సర్వే పూర్తి చేయాలి

● ఆర్డీవో మధులత

బొల్లాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టుపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధులత మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ సుధాకర్, ఎంపీడీవో పీ సీతారామయ్య, ఇరిగేషన్ అధికారులు, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ శివ కుమారి

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి

● డీడీఏ శివ కుమారి

రొంపిచర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా చేయటమే పొలం పిలుస్తోంది ముఖ్య ఉద్దేశమని డీడీఏ శివకుమారి మంగళవారం తెలిపారు. మండలంలోని మాచవరం, విప్పర్ల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. వ్యవసాయ, మత్స్య, ఉద్యాన, పట్టు, పరిశ్రమ, సేంద్రీయ, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలను అందిస్తారని తెలిపారు. సాగు కష్టాలు తెలుసుకొని నూతన దిగుబడులపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యం గురించి వివరించారు. ఏడీఏ మస్తానమ్మ, ఏవో శివలలిత పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు విజయలక్ష్మి, రాజశేఖర్, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వినుకొండ రూరల్ మండలంలో..

వినుకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకనకొండ, నాగులవరం గ్రామంలో ఉద్యానవనశాఖ అధికారి రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానవనశాఖ జిల్లా అధికారి కిశోర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయడం జరిగిందని, పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీమీద విత్తనాలను రైతులకు అందించడం విత్తనాలు భూమిలోవేసి పూత దశవరకూ వచ్చిన తర్వాత భూమి కలియదున్నటం ద్వారా భూమిలో సేంద్రియ శాతం పెరిగి, తద్వారా భూమిలో నిల్వ ఉన్న సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందుబాటులోకి వస్తుందని, రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించవచ్చని, దీంతో రైతులకు పంటలకు పెట్టుబడి తగ్గించవచ్చని తెలిపారు.

పచ్చిరొట్ట, జీవన ఎరువులతో భూసారం పెంచుకోవాలి

● సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ

నరసరావుపేట రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల్లో పచ్చిరొట్ట, జీవన ఎరువులు వినియోగించడం ద్వారా భూసారం పెంపొందించుకోవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ తెలిపారు. మండలంలోని ఎల్లమంద, గురవాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు మద్దినేని శివకుమారి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ఎం.అరుణకుమారి, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, ఏఈవో బ్రహ్మయ్య, సాయి, షాహిర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపసంచాలకులు మద్దినేని శివకుమారి రైతులనుద్దేశించి మాట్లాడుతూ మట్టి పరీక్షల విశ్లేషణ ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారుల సిఫారసుల మేరకు ఎరువులను వాడుకోవాలని రైతులకు సూచించారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం కావాలి: ఎంపీఈవో

నూజెండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా వర్షాలు పడుతున్న దృష్ట్యా ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం కావాలని ఎంపీఈవో ఎలిషా అన్నారు. మండలంలోని కమ్మవారిపాలెం, నూజెండ్ల గ్రామాల రైతులతో రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.